వనం నాగయ్య, కెరటం న్యూస్

**ఒకే ఒక్క ఎకరం సాగుచేసుకునే** రైతు కొడుకు..

సాగు భూమిలో తన తండ్రిని నిశితంగా పరిశీలించి చిరుప్రాయంలోనే రైతు కష్టం ఏంటో కండ్లారా చూసిండు.. ఇంటికి పెద్ద కొడుకుగా పుట్టినందుకు తన తలరాత మార్చుకోవాలని కలలు గన్నాడు.. కదిలే కాలంతో పోటీ పడి లక్ష్యం విసిరన బాణంలా అనుకున్నది సాధించాడు.. రంగరాయ మెడికల్ కాలేజీ చరిత్రలో 9గోల్డ్ మెడల్స్ సాధించిన దిగ్గజ వైద్యుడు. కాలాన్ని జ్ఞానాన్ని ఒడిసి పట్టి మానవాళిని అతలాకుతలం చేస్తున్న కిడ్నీ వ్యాధిని బాగుచేసే పనిలో ముప్పై ఏండ్లుగా అవిశ్రాంతంగా వైద్య సేవలు అందిస్తూ వైద్య విజ్ఞాన మహర్షిలా వేనోళ్లా కీర్తి గడిస్తున్నారు...అందుకే ఈ రోజున ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే పేదలకు అందించే ఆరోగ్య శ్రీ సేవల్లో ఓవరాల్ టాపర్‌గా నిలిచాడు. ఆయన అసమాన వైద్య సేవలకు జేజేలు పలికిన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జాతీయ వైద్యుల దినోత్సవాన ఆయన్ను సగర్వంగా సన్మానించుకుంది. 14ఏండ్లు గా ఆరోగ్య శ్రీ సేవల్లో సుమారు 3లక్షలకు పైగా ఓపీలు పూర్తి చేసి ఉమ్మడి, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఆయన నాడి పట్టని ఊరులేదంటే అతిశయోక్తి కాదంటారు ఆయన గురించి తెలిసి న వారెవరైనా.. ఇంతకీ ఎవరనేగా మీ సందేహం.. ప్రముఖ యూరాలజిస్ట్‌గా, మూత్ర అవయవ శస్త్ర చికిత్స నిపుణులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా మెడలో వజ్రంలా మెరుస్తున్న శ్రీరాం కిడ్నీ సెంటర్ అధినేత డా.కే.గురునాథరావు.



# లక్ష్యం విసిరిన బాణం

# డా.కే.గురునాథరావు

## కిడ్నీ వైద్య సేవల్లో 30 ఏళ్లుగా తిరుగులేని ప్రస్థానం..

- రంగరాయ మెడికల్ కాలేజీ చరిత్రలో 9గోల్డ్ మెడల్స్ సాధించిన దిగ్గజ వైద్యుడు
- కదిలే కాలంతో పోటీపడి గెలిచిన ధీశాలి
- ఆరోగ్య శ్రీ ద్వారా మూడు లక్షల ఓపీలు, 35వేల ఆపరేషన్లు పూర్తి..
- ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నిరాడంబరుడు
- ఆయన అసమాన వైద్య సేవలకు జేజేలు పలికిన ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం






### ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాలో తొలి సూపర్ స్పెషాలిటీ యూరాలజిస్ట్..

### పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టుగా..

కృష్ణా జిల్లా నందిగామ మండలం లోని లింగాలపాడు అనే చిన్న పల్లెటూ ళ్లో కొల్లూరి వెంకటేశ్వర్లు, నారాయణ మ్మ దంపతుల ముగ్గురు సంతానం (గురునాథరావు, సత్యానారాయణ, గోవిందరావు)లో పెద్ద కుమారుడు డా.కే గురునాథరావు. ఇంటికి పెద్ద కొడుకుగా పుట్టడంతో తన తండ్రికి ఉన్న ఒక్క ఎకరంతో సాగుచేసు కుంటూ పడుతున్న బాధలు తెలుసుకు న్నాడు. ఊహ తెలిసిన నాడే పిల్లవాడు తెలివిగా వ్యవహరిస్తుండటంతో అమ్మా నాన్నలు బడికి పంపారు. మొదటి నాలుగు తరగతుల్లో అసమాన తెలివితేటలు కలిగి ఉన్నందున నాడు సర్కారు బడి పంతుళ్లు ఆయనను నాలుగు, ఐదు తరగతుల పరీక్షలు ఒకే సారి రాయించారు. మంచి మార్కులు రావడంతో నేరుగా ఆరోతరగతిలో చేర్చారు. ఇలా ప్రాథమిక విద్యను స్థాని కంగా పూర్తిచేసుకుని 6,7,8 తరగ తులు పక్కనే ఉన్న కోనాయిపాలెంలో పూర్తిచేశారు. 9,10 తరగతులు నందిగామలో పూర్తిచేశాడు. ఇలా పువ్వు పుట్టగానే పరిమళిస్తుం దన్నట్టుగా మిగతా 2లో..





(మొదటిపేజీ తరువాయి..)

తనలోని ప్రతిభాపాఠవాలు చిరుప్రాయంలోనే చాటిచెప్పారు.

## కదిలే కాలాన్ని, జ్ఞానాన్ని ఒడిసిపట్టిన నేర్పరి..

నందిగామలో పదో తరగతిని అత్యుత్తమ మార్కులతో పూర్తిచేసుకున్న గురునాథరావు ఆ వెంటనే విజయవాడ సిద్ధార్థ కాలేజీలో 1980లో ఇంటర్ పూర్తిచేశాడు. అనంతరం జరిగిన ఎంసెట్ ప్రవేశ పరీక్షలో ఏకంగా కృష్ణా జిల్లా టాపర్‌గా నిలిచి కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో సీటు పొందారు. 1980నుండి 86వరకూ వైద్య విద్యను పూర్తిచేసి ఆ కాలేజీ చరిత్రలోనే నిలిచిపోయేలా ఏకంగా 9 బంగారు పతకాలు(గోల్డ్‌మెడల్స్) సాధించి తనలోని అసమాన వైద్య విజ్ఞాన మహర్షిని సమాజానికి సరికొత్తగా పరిచయం చేశాడు. కాలేజీలోని 125 మంది విద్యార్థుల్లో ఒకడిగా ఉన్న గురునాథరావు 12గోల్డ్ మెడల్స్‌లో ఏకంగా 9 సాధించడంతో ఆయన పేరు మారుమోగిపోయింది. అంతేకాదు ఓవరాల్ బ్యాచ్ బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచి తనేంటో రుజువుచేసుకున్నాడు. అనంతరం చండీగఢ్ పీజీఐలో పీజీ పూర్తిచేసి 1991లో ఉస్మానియా మెడికల్ కాలేజీలో యూరాలజీ విభాగంలో ఎంసీహెచ్‌ను పూర్తిచేసి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాడు. పూర్తిస్థాయి కిడ్నీ, మూత్ర సంబంధ వైద్యునిగా పేరుగాంచి తొలి మూడేండ్లు నిమ్స్‌లో పనిచేశారు.

## ఆరోగ్యశ్రీ సేవలకు ఆయువు పోసిన వైద్యుడు..

1995లో తొలిసారిగా ఖమ్మం గుమ్మంలో అడుగుపెట్టిన డా.కే.గురునాథరావు తొలుత ఖమ్మం వినోదా థియేటర్ సమీపంలో (మయూరి సెంటర్) పాత వెంకటరెడ్డి హాస్పిటల్‌లో శ్రీరాం కిడ్నీ సెంటర్‌ను ప్రారంభించారు. అనతికాలంలోనే ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన అత్యుత్తమ వైద్య సేవలు అందించడంతో ఆయన పేరు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో మారుమోగిపోయింది. అప్పట్లో



నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఫ్లోరైడ్ మహమ్మారితో అనేక మంది కిడ్నీ బాధితులుగా మారేవారు. వారందరికీ వైద్యం అందించి కిడ్నీ వ్యాధిని నయం చేశారు. ఇలా కిడ్నీ బాధితుల పాలిట వైద్యశాస్త్ర వారధిలా, నవప్రస్థాన సారథిలా కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఈ నేపథ్యంలోనే నాటి ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రజలకు అందించడంతో డా.కే.గురునాథరావు ఎనలేని కృషిచేశారు. ఇప్పటికి 35వేల కిడ్నీ సంబంధిత ఆపరేషన్లు, మూడు లక్షలకు పైగా ఆరోగ్యశ్రీ ఓపీ సేవలు అందించి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే నెంబర్ వన్‌గా నిలిచాడు. ఫలితంగా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన సేవలకు జేజేలు పలికాయి. రాష్ట్ర ఉత్తమ సేవా పతకాన్ని అందించి సగర్వంగా సత్కరించుకున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే డా. కే.గురునాథరావు దగ్గర కిడ్నీ వైద్యం కోసం రాని గ్రామం ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో లేవంటే అతిశయోక్తి కాదంటారు.

## పురిటిగడ్డను కన్నతల్లిలా భావిస్తారు..

ఎంత ఎదిగినా అంతగా ఒదిగి ఉండే డా. గురునాథరావు తను పుట్టి పెరిగిన లింగాలపాడు గ్రామాన్ని మాత్రం మరిచిపోలేదు. తను సంపాదించిన దాంట్లో ఎంతో కొంత దానం చేయాలన్న పవిత్ర ఆశయంతో గ్రామంలోని దేవాలయానికి రూ.15లక్షలతో గ్రానైట్‌ను విరాళంగా అందజేశారు. స్వగ్రామంలో రూ.10లక్షల వ్యయంతో సొంతంగా ఫంక్షన్ హాల్ నిర్మించారు. తాను చిన్నప్పుడు చదువుకున్న స్కూళ్లకు సైన్స్ ల్యాబ్‌కు పరికరాలు, సీసీ టీవీలకోసం వేలాది రూపాయలు అందజేశారు. కాగా డా.కే గురునాథరావు సతీమణి డా.శ్రీకళ ఖమ్మంలో సంతానసాఫల్య నిపుణులుగా, గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. వారి ఒక్కగానొక్క ముద్దుల కుమారుడు డా.నాగచైతన్య ప్రస్తుతం వైద్య విద్య చదువుతున్నారు. తాను నాలుగో తరగతి చదివే రోజుల్లో తన గురువు చిట్టా కనకరాజు నాడు గ్రామంలో వైద్యం చేసే సమయంలో గురువు దగ్గర వైద్యం నేర్చుకున్నాడు. ఇలా నూనూగు మీసాలు కూడా రాని రోజుల్లోనే డాక్టర్‌గా పిలిపించుకున్న గురునాథరావు తన జీవితంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు డాక్టర్ అని సగర్వంగా పిలుచుకునేలా చేసి బుద్ధి కుశాలిగా, సత్యశీలిగా,



దార్శనికునిగా దిగ్గజ యూరాలజిస్ట్‌గా నిలిచారు. అలాగే ఖమ్మం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనానికి డైనింగ్ హాల్‌ను డాక్టర్ గురునాథరావు ప్రధానం చేశారు.




